



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 316 | ది. 28-2-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 316 | Date :28-2-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |



## వివేకా హత్య.. రెండేళ్ల తర్వాత మరోసారి సీబీఐ విచారణ

**పులివెందుల: ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో రెండేళ్ల తర్వాత సీబీఐ మరోసారి విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితులు సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్‌కుమార్, భరత్‌కుమార్ యాదవ్ సోదరుడు మహేంద్ర యాదవ్‌ను విచారణకు రావాల్సిందిగా ఇప్పటికే నోటీసులు ఇచ్చింది. తాజాగా కడప జిల్లా పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న సీబీఐ అధికారులు వారిని విచారించనున్నారు. మహేంద్ర యాదవ్ విచారణకు హాజరు కాగా.. కిరణ్ యాదవ్ సాయంత్రం 4 గంటలకు విచారణకు రానున్నట్లు తెలుస్తోంది.

## ఈ ఏడాది చివరికి 10 లక్షల ఇళ్లకు పైగా

# గృహ ప్రవేశాలు

**● ఇళ్లు లేనివారు దరఖాస్తులు చేసుకోవాలి ● గత ప్రభుత్వంలో హౌసింగ్‌లో అక్రమాలకు పాల్పడ్డవారిని శిక్షిస్తాం ● అగ్రిటెక్, పంచ సూత్రాలతో వ్యవసాయ రంగం బలోపేతం ● రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతాం ● వ్యవసాయం, హౌసింగ్ బడ్జెట్ పద్దుపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి, ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రతి పేదవానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పటికే సుమారు 3 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేపట్టామని... మొత్తంగా ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల ఇళ్లకు పైగా గృహ ప్రవేశాలు చేయిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇళ్లు లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నామని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో హౌసింగ్, వ్యవసాయ శాఖ పద్దులపై ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆయా శాఖల్లో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "గత పాలకులు గృహ నిర్మాణం రంగంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక విధానాన్ని కూడా అస్తవ్యస్తం చేసి అవినీతికి పాల్పడ్డారు. ఈ అక్రమాల్లో భాగస్వాములైన వారిని చట్టపరంగా శిక్షిస్తాం. రాష్ట్రంలో 2.20 లక్షల కుటుంబాలకు ఇంటి జాగాలు లేవు. వారందరికీ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఉచితంగా కేటాయిస్తాం. అందరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నాం. ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను రాయచోటి నుంచి ప్రారంభించాం. ఈ ఏడాది ఉగాదిలోగా దాదాపు 3 లక్షల ఇళ్లల్లో గృహప్రవేశాలు చేయిస్తాం. జూన్‌కు 2.26 లక్షలు, సెప్టెంబరులో 2.10 లక్షల ఇళ్లకు కూడా గృహప్రవేశాలు జరిగేలా లక్ష్యం నిర్దేశించుకున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటాయి. గత పాలకులు చేసిన తప్పును సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. త్వరలోనే దీనిపై కార్యాచరణ చేపడతాం. 2029లోగా పేదలందరికీ ఇళ్లు కట్టించటంతో పాటు ఉచితంగా ఇంటి స్థలాలు కూడా ఇస్తాం" అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

**వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఏఐ సేవలు**"అగ్రిటెక్‌తో పాటు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, ప్రభుత్వ మద్దతు అనే ఐదు సూత్రాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. జాతీయ స్థూల ఉత్పత్తిలో 10 శాతం మేర వ్యవసాయం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంట్రిబ్యూట్ చేస్తోంది. రైతు

## ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ

**● అనకాపల్లి జిల్లా రాంబిల్లి సెజ్ లో బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు ● రేపు మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా బ్లూ జెట్ పరిశ్రమకు శంకుస్థాపన ● రూ.2,300 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉద్యోగాల కల్పన**

**అమరావతి: ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అనేక ఐటీ, ఫార్మా కంపెనీల రాకతో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ రానుంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ఇండస్ట్రియల్ పార్క్ లో ప్రముఖ ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ పరిశ్రమకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రేపు శంకుస్థాపన చేయనున్నారు. రాంబిల్లి సెజ్ లో బ్లూ జెట్ పరిశ్రమ ఫార్మాస్యూటికల్, ఇంటర్మీడియట్, కాంట్రాక్ట్ డెవలప్ మెంట్ తయారీ యూనిట్ ను ఏర్పాటుచేస్తుంది. మహారాష్ట్రలో ప్రధాన కార్యాలయం కలిగి ఉన్న బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్.. శాస్త్ర ఆధారిత ప్రత్యేక ఔషధ, ఆరోగ్య సంరక్షణ పదార్థాల రంగంలో ప్రఖ్యాత సంస్థగా పేరుగడించింది.

**రూ.2,300 కోట్ల పెట్టుబడి, 1,750 మందికి ఉద్యోగాల కల్పన** జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటుకోసం కూటమి ప్రభుత్వం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, జడ్.చింతువ రెవెన్యూ పరిధి సీతపాలెం వద్ద సెజ్ లో రెండో విడతగా సేకరించిన భూముల్లో 102.48 ఎకరాలను కేటాయించింది. ఎకరా రూ.40 లక్షలకు కేటాయించడంతో పాటు అదనపు ప్రోత్సహకాలు మంజూరు చేసింది. రూ.2,300 కోట్ల పెట్టుబడితో బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమను దశల వారీగా అభివృద్ధి చేయనున్నారు. 2028-29 ఆర్థిక సంవత్సరానికి సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ద్వారా 1,750 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు రానున్నాయి. ఈ పెట్టుబడి స్థానిక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించి, రాష్ట్రాన్ని అధునాతన ఫార్మాస్యూటికల్ తయారీకి కీలక గమ్యస్థానంగా మార్చడంలో దోహదపడనుంది.

## యాదవ జాతి సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

**● యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్**



**విజయవాడ, ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడలోని గొల్లపూడి లోని బీసీ భవన్ నందు యాదవ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మూడవ కార్యవర్గ సమావేశం జరిగినది. ఈ కార్యక సమావేశంలో యాదవ వెల్ఫేర్ డెవలప్మెంట్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అధ్యక్షత వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ జి ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము పాల్గుణ మాసము శుద్ధ పంచమి రోజు కాటమరాయుడు గారి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని, అలాగే మార్కాపురం జిల్లాకు కాటమరాజు జిల్లాగా పేరు ప్రకటించాలని, తిరుమల ఆలయ నిర్మాతలు యాదవుల రాయల విగ్రహాలను మరియు యాదవ మఠం తిరుమలలో నిర్మించాలని పేర్కొన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి నియోజకవర్గంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి మరియు యాదవుల కళ్యాణ మండపానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అలాగే ఆంధ్రప్రదేశ్ లోని యాదవుల జనాభా ప్రకారము తగిన అధికార అవకాశాలను, పదవులను కేటాయించాలనీ, చట్టసభల్లో బి.సి. రిజర్వేషన్లు ఇవ్వాలని కోరడం జరిగినది. దీనికి సమాధానంగా యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహులు మాట్లాడుతూ డైరెక్టర్ మస్తాన్ యాదవ్ విన్నవించిన ప్రతి అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి మరియు యువ నాయకుడు నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశలో ప్రయత్నిస్తానని చెప్పడం జరిగినది.

## నాడు అసుర పాలన- నేడు నారాసుర పాలన

**నాడు ఎన్టీఆర్ కు నేడు ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు**
**చంద్రబాబుపై లక్ష్మీ పార్వతి ఫైర్**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27(వార్తా ప్రభ ప్రతినిధి):** నాడు రాక్షసుడైన అసురుడు ఏ విధంగా ప్రజలను కష్టాలు పాలు చేశాడో నేడు నారాసురుడు అయిన చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజలు కష్టాలు పడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు మాజీ ఎమ్మెల్యే,ఏపీ తెలుగు అకాడమీ మాజీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి. శుక్రవార మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ జోగి రమేష్ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఆమెకు ఇంటిపై టిడిపి నాయకుల దాడిని వివరించారు జోగి రమేష్. ఈ సందర్భంగా మీడియాతో లక్ష్మీపార్వతి మాట్లాడుతూ జోగి రమేష్ ఇంటిని చూస్తుంటే బాధగా ఉందని,రాష్ట్రంలో తండ్రి కొడుకులు రాక్షస పాలనను సాగిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు నాడు ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచి ప్రజాస్వామ్యాన్ని మంట కలిపారని, అదేవిధంగా నేడు ప్రజాస్వామ్యాన్ని మంటగలిపేలాగా దాడులతో పాలన సాగిస్తున్నారని అన్నారు.రెడ్ బుక్ రాజ్యాంగం అంటే ఒక ప్రత్యేక రాజ్యాంగంగా కొనసాగిస్తున్న లోకేష్ మంత్రిగా అనర్హుడని అన్నారు.స్టాండ్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నానని చెప్పుకుంటున్న లోకేష్ కు ఏ బి సి డి లు కూడా క్రమ పద్ధతిలో రాయడం రాదని ఎద్దేవా చేశారు. నాడు వైయస్సార్, జగన్మోహన్ రెడ్డికులం...మతం ..రాజకీ యాలు చూడకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి పేదల నాయకులుగా ముద్రపడాలని, పేదల పెన్షన్లు తొలగించి, వైసీపీ నాయకులను వేధిస్తూ తండ్రి కొడుకులు పైశాచిక ఆనందం పొందు తున్నారని అన్నారు.చంద్రబాబు నాయుడు పాలనలో అక్రమాలకు కొదవలేదని, రాష్ట్రాన్ని మరో బీహార్ గా మార్చారని తెలిపారు.పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని,దేశంలోనే అట్టడుగు ర్యాంకుకు పడిపోయిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థ అని ఆవేదన వ్యక్తం చేశారు.2029లో ఓడిపోగానే తండ్రి కొడుకులు ఇతర దేశాలకు పారిపోయారని... బలి అయ్యేది సామాన్య కార్యకర్తలే జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## సాదాసిదాగా సాగిన కొండపల్లి కౌన్సిల్ సమావేశం



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా జరిగింది. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అధ్యక్షత వహించారు. సీఎస్ఆర్ ఫండ్ రూ.2.43 కోట్లతో వివిధ పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాల రోడ్డును మురుగు ముంచెత్తడంతో అధికార పార్టీ నాయకుడు నిరసనకు దిగిన విషయాన్ని వైసీపీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు ప్రస్తావించారు. కొంతకాలం నుంచి ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని ప్రశ్నించారు. గతంలో కాంట్రాక్టర్ పనిచేయలేదని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని చైర్మన్ చిట్టిబాబు తెలిపారు. కో - ఆప్షన్ సభ్యుడు యర్రంశెట్టి నాని మాట్లాడుతూ కొండపల్లి అభివృద్ధికి నిధులు వెచ్చించాలని కోరారు. ఇబ్రహీంపట్నానికి ప్రాధాన్యత కల్పించినట్లే కొండపల్లికి కూడా కల్పించాలని కోరారు.

## స్వచ్ఛ రథం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోండి -ఎంపీపీ లక్ష్మీ



**● ఎంపీపీ కార్యాలయంలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ**
**● కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, అధికార పార్టీ నాయకులు**

**జి.కొండూరు: ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా పొడి చెత్త సేకరణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథం సేవలను జి.కొండూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ కోరారు.స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో బి.వి. రామకృష్ణ నాయక్, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో ఏటుకూరి బసవలింగేశ్వరరావు,వివిధ గ్రామాల ఎంపీటీసీ లు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వర రావు, లంక నాగేశ్వరరావు,ఐ డి సి డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని,ఏఎంసి మాజీ చైర్మన్ వుయ్యూరు వెంకట నరసింహారావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పజ్జూరు రవికుమార్ లతో కలిసి స్వచ్ఛ రథం ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు.ప్రజలు తమ ఇంటిలో పనికిరాని పొడి చెత్తను స్వచ్ఛ రథం సిబ్బందికి ఇచ్చి వారినుంచి నిత్యవసర సరుకులు పొందవచ్చని ఎంపీపీ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కందుల విశ్వ కుమార్,గడ్డమణుగు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ నూతక్కి రాజా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భావి భారత నేతలుగా మెరిసిన విద్యార్థులు: నూజివీడులో అలరించిన 'మాక్ అసెంబ్లీ'



**నూజివీడు, ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక త్రివిధ పాఠశాల విద్యార్థులు అసెంబ్లీ నాయకులుగా మారి నిర్వహించిన 'మాక్ అసెంబ్లీ' సమావేశం అటు తోటి విద్యార్థులను, ఇటు స్థానిక నేతలను, తల్లిదండ్రులను విశేషంగా ఆలోచింపజేసింది. రాష్ట్రంలోని ప్రస్తుత సమస్యలపై చిన్నారులు ప్రదర్శించిన అవగాహన, వారు మాట్లాడిన తీరు అందరినీ కట్టుకుంది.

**సభా వేదికపై సమస్యల జాతర** ఈ మాక్ అసెంబ్లీలో విద్యార్థులు స్పీకర్, అధికార పక్ష నేతలు మరియు ప్రతిపక్ష నాయకులుగా విడిపోయి సభా కార్యక్రమాలను అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న విద్య, వైద్యం, మౌలిక వసతులు వంటి కీలక సమస్యలపై ప్రశ్నోత్తరాల సమయం హోరాహోరీగా సాగింది. అధికార పక్షాన్ని ప్రతిపక్ష విద్యార్థులు సంధించిన ప్రశ్నలు, దానికి వారు ఇచ్చిన సమాధానాలు నిజమైన అసెంబ్లీని తలపించాయి.


## గ్రామ పంచాయితీ కార్యాలయం-వెంకటాపురం

**జి.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్**

**టెండరు ప్రకటన**

తేది : 28-02-2026

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామ పంచాయితీ ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను ఒక సంవత్సరమునకు అనగా ది.01-04-2026 నుండి ది.31-03-2027 వరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు ది.09-03-2026 మధ్యాహ్నం గం. 12.00లు వరకు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయ పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ. సంఖ్య | పని పేరు | కాలము | టెండరు ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుద్ధ్య పనులు-2 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 2 X 500/- |
| 2) | ట్యాంకు ఆపరేటర్-1 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 1 X 500/- |
| 3) | వీధి దీపముల రిపేరు-1 (ఎలక్ట్రీషియన్) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 1 X 500/- |

నోట్ :-
1. గతంలో గ్రామ పంచాయితీ పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
2. పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును.

**సం/- శ్రీమతి కొప్పుల తేజశ్విని**
**సర్పంచ్**
**గ్రామ పంచాయితీ-వెంకటాపురం**
**జి.కొండూరు మండలం**

**సం/- శ్రీ ఉయ్యాల రాజా**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయితీ-వెంకటాపురం**
**జి.కొండూరు మండలం**




## దస్తావేజు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రూరల్, గొల్లపూడి, ఆషా హాస్పిటల్ వీధి, కెవిఎన్ రెసిడెన్సీ, ఫ్లాటు నెం.203, డోరు నెం.15-2/1 కాపురస్తురాలు పసుమర్తి (లేటు) జయసూర్య గారి భార్య పసుమర్తి వసంతలక్ష్మి అను నేను 6 సంవత్సరముల క్రితం విజయవాడ, దుర్గాపురం నుండి గొల్లపూడికి ఇల్లు మారే సందర్భంలో నా భర్తగారైన పసుమర్తి జయసూర్య గారి పేరిట ది.26-12-2002వ తేదీన విజయవాడ జిల్లా రిజిస్ట్రారు ఆఫీసులో 1వ పుస్తకం, నెం.8896/2002రుగా గల ఒరిజినల్ విక్రయ దస్తావేజు మరికొన్ని కాగితములు కలిగిన కవర్ జారిపడిపోయినది. ది.15-01-2026వ తేదీన ఇంటి కాగితములు వెతకగా ఎక్కడా కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజులు కనవడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగవరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజులను ఎవరికినీ తాకట్టు పెట్టుట గానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగియుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

**సెల్ నెం.9154239284**


## నూజివీడులో అద్భుత శిలువగట్టు తిరునాళ్ల సందడి

### భక్తి శ్రద్ధలతో తొలిరోజు వేడుకలు



**నూజివీడు, ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**క్రీస్తు ప్రేమకు ప్రతిరూపం, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే నూజివీడులోని అత్యంత ప్రముఖ పుణ్యక్షేత్రం "అద్భుత శిలువగట్టు" తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి ప్రారంభమైన ఈ ప్రధాన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, 27, 28 వ తేదీల్లో కనులపండువగా కొనసాగనున్నాయి.

**ఆధ్యాత్మిక సందేశం - దివ్యబలి పూజ:** ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఫాదర్ చిన్నప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యబలి పూజను అత్యంత భక్తితో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు దైవాశీస్సులు అందజేస్తూ కీలక సందేశాన్ని ఇచ్చారు. "మనలో ఉన్న పగ, ప్రతీకారం, ద్వేషాన్ని ప్రతిఒక్కరూ వీడాలని" ఆయన పిలుపునిచ్చారు. ఈ సందేశం భక్తులలో గొప్ప ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపింది.



**దేదీప్యమానంగా శిలువగట్టు** పుణ్యక్షేత్ర ముఖద్వారం నుండి కొండగట్టు వరకు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెక్టర్ దారం సతీష్, ఇతర గురువులు ప్రసంగిస్తూ, క్రీస్తు చూపిన ప్రేమ మరియు త్యాగ మార్గంలో నడవాలని భక్తులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో గుణదల మేరీమాత ఆలయం తర్వాత అత్యంత ప్రాచుర్యం పొందిన క్షేత్రంగా శిలువగట్టు విరాజిల్లుతోందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

**పటిష్టమైన పోలీసు బందోబస్తు:**భారీగా తరలివస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ యంత్రాంగం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది.

## కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలిచే దైవం శ్యామ్ బాబా.

**కాంగ్రెస్ నాయకులు మిరియాల ప్రీతమ్ ప్రత్యేక పూజలు**





**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 27 (వార్తాప్రభ):** ఖాటూ శ్యామ్ బాబా జయంతి సందర్భంగా చందా నగర్‌లోని గాంధీ స్టాట్యూ రోడ్ వద్ద నిర్వహించిన భక్తి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి .కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు మిరియాల ప్రీతమ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఖాటూ శ్యామ్ బాబా ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి, సౌఖ్యం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే దైవంగా శ్యామ్ బాబాపై భక్తుల విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. భక్తులతో కలిసి జయంతి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. సమాజంలో ఆధ్యాత్మికత, సానుకూల దృక్పథం పెంపొందేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. పూజల అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో అజిత్,పరదేశి నాయుడు,భాటియా,వెంకటేష్, మధు,స్థానిక నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ. త్వరితగతిన పూర్తి చేయండి

- మాజీ కార్పొరేటర్ రఘునాథ్ రెడ్డి



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 27 (వార్తాప్రభ):** చందానగర్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న వరద నీటి కాలువల నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆర్జున్‌రెడ్డి కాలనీ,డిఫెన్స్ కాలనీ,ఫ్రెండ్స్ కాలనీలలో జరుగుతున్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనుల పురోగతిని (జీహెచ్ఎంసీ) అధికారులు,కాలనీ వాసులతో కలిసి తనిఖీ చేశారు. పనుల నాణ్యతలో లోపాలు ఉండకూడదని అధికారులకు సూచించారు. వేసవి ముగిసేలోపు పనులు పూర్తి చేసి వర్షాకాలంలో కాలనీల్లో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గత వర్షాల్లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కార లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. అధికారులు,కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి నాణ్యమైన మౌలిక వసతులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు వరలక్ష్మి,కాలనీ ప్రతినిధులు,స్థానిక నాయకులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


## యువత స్వయం ఉపాధి మరియు వ్యాపారంలోకి వచ్చి అభివృద్ధి బాటలో ప్రయాణించాలి.

**ఆర్మీ నెంబర్ వన్ వాషింగ్ సెంటర్ ప్రారంభించిన బి.జె.పి.నేత మహేష్ యాదవ్**




**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 27 (వార్తాప్రభ):** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మాధవనగర్‌లో లింగరాజు నూతనంగా ప్రారంభించిన ఆర్మీ నంబర్ వన్ ఫోమ్ వాషింగ్ సెంటర్ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు బోయిని మహేష్ యాదవ్ హాజరై వాషింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన యువకుడిని ప్రజలు ఆదరించాలని కోరారు. రాబోయే రోజుల్లో యువత స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, జానీ, నాయుడు, దేవేందర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ డివిజన్‌లో వేగంగా అభివృద్ధి పనులు పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి.




**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 27):** హయత్‌నగర్ డివిజన్ పరిధిలో లక్ష్మీప్రియ కాలనీ,బంజారా కాలనీల్లో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ మరియు సీసీ రోడ్ల నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాని శ్రీనివాస్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టూర్ల పేరిటా దోపిడే!!

- వ్యాపారంగా విజ్ఞాన యాత్రలు
- పేరెంట్స్ జేబులకు స్కూళ్ల కత్తెర
- జ్ఞానం పెరగడం మాట దేవుడెరుగు
- తల్లిదండ్రులపై ఆర్థిక భారమే అరుపు
- తల్లిదండ్రుల ఆవేదన - అప్పుల వేదన
- విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు ఉందా?
- కమీషన్ల కోసం నాణ్యత లేని ప్రయాణాలు
- వందలాది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం?








*వార్తా కథనం* - *ఓవైపు పిల్లల బాధ..... మరోవైపు ఆర్థిక భారంతో సతమతమవుతున్న పేరెంట్స్

**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 27 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రస్తుత సమాజంలో విద్యా వ్యవస్థ సేవా దృక్పథాన్ని వీడి వ్యాపార ధోరణిలోకి వెళ్లడంతో ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ముఖ్యంగా విజ్ఞాన విహారయాత్రల పేరుతో సాగుతున్న ఈ దోపిడీ పర్వం హద్దులు దాటుతోంది. విద్యా సంవత్సరం మధ్యలో, చివరలో అదనపు ఆదాయం కోసం యాజమాన్యాలు టూర్లను ఒక ఆయుధంగా వాడుకుంటున్నాయి. నిజానికి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా విద్యార్థులలో విజ్ఞానం పెరగాలనేది ఈ యాత్రల ప్రధాన ఉద్దేశం అయినప్పటికీ, నేటి పాఠశాలలు కేవలం వినోదానికి ప్రాధాన్యతనిస్తూ పిల్లల నుండి వేలల్లో వసూళ్లకు పాల్పడుతున్నాయి. తోటి స్నేహితులు వెళ్తున్నారని, తాము వెళ్లకపోతే అవమానంగా భావిస్తామని పిల్లలు ఇంట్లో మొండికేస్తుండటంతో, వారి బాధ చూడలేక తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అడిగినంత చెల్లిస్తున్నారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడి బతుకు భారమవుతుంటే, మరోవైపు స్కూల్ యాజమాన్యాల ఈ టూర్ టార్చర్ పేరెంట్స్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రభుత్వం, విద్యాశాఖ నిబంధనల ప్రకారం విహారయాత్రలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి, కానీ క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రవాణా సౌకర్యాల నుండి భోజన వసతుల వరకు ప్రతి విషయంలోనూ నాణ్యత పాటించకుండా, భారీగా కమీషన్లు దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికారులు, ఆ యంత్రాంగం ఉన్నా, ఫిర్యాదులు అందుతున్నా చర్యలు తీసుకోవడంలో చూపే జాప్యం విద్యాసంస్థల అక్రమాలకు ఊతమిస్తోంది. కేవలం ఆదాయ మార్గంగా మారిన ఈ యాత్రల వల్ల విద్యార్థులకు ఒరిగేదేమీ లేదని, ఇది ముమ్మాటికీ మధ్యతరగతి వర్గాలపై మోపుతున్న భారమని విద్యావేత్తలు, మేధావులు మండిపడుతున్నారు. తల్లిదండ్రుల ఆవేదనను గుర్తించి, ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, టూర్ల వసూళ్లపై ఒక నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది, అప్పుడే ఈ విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట పడుతుంది.

# పైసలు కట్టు.. అక్రెడిటేషన్ పట్టు!!

- అమ్ముతం కొనుక్కో అనే ధోరణి
- ఆటో డ్రైవర్ల నుంచి ఇన్సూరెన్స్ ఏజెంట్ల వరకు
- జర్నలిజం ముసుగులో జలగలు
- అందరి చేతిలో కొనుక్కున్న ప్రెస్ కార్డే
- విలువలను గాలికొదిలేసిన యాజమాన్యాలు
- వేలల్లో బేరసారాలు....సెటిల్మెంట్లు
- గల్లీకో రిపోర్టర్.. ఇంటికో ఐడీ కార్డు
- నికార్సైన విలేకరులకు మొండిచెయ్యి
- కలాల కన్నీరు.....టీవీల ఏడుపు




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 27 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రస్తుత మీడియా రంగంలో అక్రెడిటేషన్ కార్డుల జారీ వ్యవహారం అత్యంత వివాదాస్పదంగా మారి, నిజమైన జర్నలిస్టుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. "పైసలు కట్టు.. అక్రెడిటేషన్ పట్టు" అన్న చందంగా కొన్ని యాజమాన్యాలు పత్రికా, టీవీ ఛానల్ విలువలను గాలికి వదిలేసి, కేవలం ధనార్జనే ధ్యేయంగా కార్డులను విక్రయిస్తుండటం విచారకరం. క్షేత్రస్థాయిలో ఎండనక, వాననక వార్తల కోసం కష్టపడే నికార్సైన వర్కింగ్ జర్నలిస్టులకు గుర్తింపు దక్కడం లేదు సరికదా, అసలు సంబంధం లేని వ్యక్తుల చేతుల్లో మీడియా కార్డులు మెరుస్తుండటం జర్నలిజం వృత్తికే అవమానంగా మారింది. ఇన్సూరెన్స్ ఏజెంట్లు, మెడికల్ రిప్రజెంటేటివ్‌లు, ఆటో డ్రైవర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర బిజినెస్ ఏజెంట్లు ఇలా ఏ అర్హత లేని పోరంబోకులు సైతం వేల రూపాయలు వెచ్చించి కార్డులు కొనుగోలు చేస్తూ సమాజంలో జర్నలిస్టులుగా చలామణీ అవుతున్నారు. వీరంతా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం, సెటిల్మెంట్ల కోసం ఈ హోదాను, ఆ కార్డును వాడుకుంటూ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుంటే, యాజమాన్యాలు మాత్రం "అమ్ముతాం.. కొనుక్కో" అనే ధోరణితో మొండిగా వ్యవహరిస్తున్నాయి. నిబద్ధతతో పనిచేసే జర్నలిస్టులకు దక్కాల్సిన ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు అర్హత లేని వారి పరం అవుతుండటంతో అసలైన విలేకరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యాల స్వార్థం వల్ల మీడియా గౌరవం బజారున పడుతోందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి క్షేత్రస్థాయిలో వడపోత కార్యక్రమం చేపట్టి నిజమైన వర్కింగ్ జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని జర్నలిస్టు సంఘాలు, నికార్సైన వర్కింగ్ జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు.

# మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట!!

- అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల కేటాయింపు
- మైనారిటీ యువతకు 'ఇ-స్కూటర్' పథకం
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మేయర్ మహంకాళి స్వామి






**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 27 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి ఆధ్వర్యంలో రంజాన్ పండుగ ఏర్పాట్లపై నగర పాలక సంస్థ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సీఎల్ వంటి సంస్థల సహకారంతో ఈద్గాలు, మసీదుల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వీరు ఇరువురు తెలిపారు. కోట్లాది రూపాయలతో మసీదుల అభివృద్ధి, ఫంక్షన్ హాల్స్ నిర్మాణం, కబ్రస్తాన్‌లలో వసతులు కల్పిస్తున్నామని, రంజాన్ కోసం ప్రత్యేకంగా టెంట్లు, మంచి నీరు, జనరేటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ఏడాది కంటే అధికంగా, ఈసారి రూ. 14.20 లక్షల వ్యయంతో నగర పాలక సంస్థ ఏర్పాట్లు చేస్తోందని మేయర్ వివరించారు. ముఖ్యంగా మైనారిటీ యువత ఉపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇ-స్కూటర్' పథకం గురించి ఆయన అవగాహన కల్పించారు. రూ. 1.50 లక్షల విలువైన ఈ స్కూటర్‌పై ప్రభుత్వం రూ. 1.20 లక్షల సబ్సిడీ ఇస్తోందని, లబ్ధిదారులు కేవలం రూ. 30,000 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువత మార్చి 1వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, మెప్మా విభాగంలో పత్రాలు సమర్పించాలని సూచించారు. ఈ స్కూటర్ల ద్వారా ఓలా, రాపిడో వంటి సంస్థలతో అనుసంధానమై స్వయం ఉపాధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు అలాగే ఇస్లాం మత పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు.

# శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్న టి ఎస్ ఉప ముఖ్యమంత్రి

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27:(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఉదయం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి కి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు మరియు అర్చకులు ఘనస్వాగతం పలికారు. అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షణలో మంత్రి కి ప్రత్యేక ప్రోటోకాల్ దర్శన ఏర్పాట్లు చేశారు. గర్భాలయంలోని అమ్మవారిని దర్శించుకుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు మంత్రి కి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ రంగారావు మంత్రి కి అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం , అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు తో పాటు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. దర్శనం అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల



ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

# హైదరాబాద్

## డ్రైవర్ల ఆరోగ్యమే ప్రయాణీకుల రక్షణ!!

- పోలీస్ లక్ష్యం సురక్షిత ప్రయాణం
- ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం
- స్కూల్ బస్సు, లారీ, ఆటో డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు
- రామగుండం ట్రాఫిక్ ఏసీపి శ్రీనివాస్






**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 27 (వార్తాప్రభ ప్రతినిధి)** డ్రైవర్ల ఆరోగ్యమే ప్రయాణీకుల రక్షణ అని రామగుండం ట్రాఫిక్ ఏసీపి సి. హెచ్. శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో "అరైవ్ అలైవ్ 2026" రహదారి భద్రత వారోత్సవాల రెండవ దశలో భాగంగా లయన్స్ క్లబ్ సహకారంతో స్కూల్ బస్సు, లారీ, ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి, షుగర్, రక్తపోటు పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ.....డ్రైవర్లు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆయన కోరారు. రహదారి భద్రత అనేది కేవలం నియమం మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్లు జి. హరి శేఖర్, ఎన్. రామరాజు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని డ్రైవర్లలో అవగాహన కల్పించారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి


**డిప్యూటీ కమిషనర్ డి శశి రేఖ ఆదేశం**






**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 27 (వార్తాప్రభ):** మియాపూర్ సర్కిల్--48 పరిధిలో ప్రతిపాదిత 30 మీటర్ల వెడల్పు ఎచ్‌సిటీ రోడ్డు పనులకు మార్గం సుగమం చేసేందుకు ఓల్డ్ బాంబే రోడ్ (అమీన్‌పూర్ రోడ్)పై ఆక్రమణల తొలగింపు చేపట్టారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ డి.శశిరేఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెంకటాద్రి కాలనీ, టాకీ టౌన్ రోడ్,జవహర్ నగర్ ప్రాంతాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు .స్థానిక నివాసితులు, పారిశుద్ధ్య సిబ్బంది,(జీహెచ్ఎంసీ) ఎస్‌డబ్ల్యూఎం విభాగం డీఈఈ, ఏఈఈల సమన్వయంతో ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టారు. దోమల జీవచక్రం, పెంపక స్థలాలు,దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని,ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని డీసీ సూచించారు.

## వైభవంగా రేణుకా ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 27 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ డివిజన్ పి.ఏ నగర్‌లో తిరుపతి నివాసంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం భక్తి వైభవాలతో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందేందుకు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. యువత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అమ్మవారి కటాక్షంతో ప్రతి ఇంటిలో ఆనందం,ఆరోగ్యం, ఐశ్వర్యం నెలకొనాలని కోరుకున్నారు. కళ్యాణోత్సవం సందర్భంగా వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## వైసీపీకి చావో రేవో -లైట్ తీసుకుంటే ?

ఏపీలో విపక్షంలో వైసీపీ ఉంది. ఎన్నడూ లేని విధంగా కేవలం 11 సీట్లకే ఆ పార్టీ పరిమితం అయిపోయింది. ఏముందిలే మూడేళ్ళ పాటు కళ్ళు మూసుకుంటే ప్రతిపక్షంలో నుంచి అధికార పక్షం వైపు రావచ్చు అని గత ట్రాక్ రికార్డుని చూసి వైసీపీ పెద్దలు నిబ్బర పడవచ్చు. కానీ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని అంటున్నారు. దానికి అనేక ఉదాహరణలు కళ్ళ ముందు ఉన్నాయి అని చెబుతున్నారు. తమిళనాడులో ఒకసారి డీఎంకే గెలిస్తే మరోసారి అన్నా డీఎంకే గెలిచేది. అయితే 2006లో డీఎంకే గెలిచిన తరువాత 2011లో అన్నా డీఎంకే గెలిచింది. ఆ ప్రకారం చూస్తే 2016లో డీఎంకే రావాల్సి ఉంది. కానీ జనాలు మాత్రం మరోసారి జయలలిత నాయకత్వానికే పట్టం కట్టారు. అలా అంతకు ముందున్న ట్రాక్ రికార్డుని బ్రేక్ చేశారు. దాంతో డీఎంకే పదేళ్ళ పాటు అధికారం కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ఇక ఒక్కసారి దేశంలో చూసుకుంటే ఎన్డీయే వరస విజయాలు సాధిస్తోంది. బీహార్ లో నితీష్ కుమార్ అలా ఎన్డీయే భాగస్వామిగా వరుసగా రెండోసారి అధికారంలోకి 2025 ఎన్నికల్లో వచ్చారు. హర్యానాలో బీజేపీ 2019లో గెలిచింది. 2024 లో వరసగా రెండోసారి ఆ పార్టీనే జనాలు ఎన్నుకున్నారు. ఇదే సీన్ మహారాష్ట్రలో రిపీట్ అయింది. 2019లో గెలిచిన బీజేపీ మిత్రుల కూటమి 2024లో మళ్ళీ గెలిచి చూపించింది. ఈ ట్రెండ్ అనేక చోట్ల సాగుతోంది. ముఖ్యంగా చూస్తే ఎన్డీయేతో కలిసిన మిత్రులకు విజయాలు వరసగా దక్కుతున్నాయి. ఏపీలో చూస్తే కూటమి పటిష్టంగా ఉంది. టీడీపీ నాలుగున్నర దశాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న పార్టీ సంస్థాగతంగా చూస్తే దేశంలో ఏ పార్టీ లేని విధంగా బలంగా ఉంది. చంద్రబాబు రాజకీయ వ్యూహాలు ఆయన చాతుర్యం అందరికీ తెలిసిందే. విపక్షం నుంచి అధికార పక్షం వైపు ఆయన ఎలా దూసుకుని వచ్చారో తెలిసిందే. అధికారంలో ఉన్న బాబు ఇంకా బలవంతుడని అంటారు. ఆయనని ఢీ కొట్టడం అంటే బహు కష్టమన్న భావన ఉంది. ఇక పవన్ కళ్యాణ్ సినీ గ్లామర్ తో పాటు బలమైన సామాజిక వర్గం వెన్ను దన్నుగా ఉంది. అలాగే బీజేపీ వైపు ఉన్న వర్గాలు ఉండనే ఉన్నాయి. మోడీ ఇమేజ్ బాగా వర్కౌట్ అవుతుంది. ఈ నేపథ్యంలో కూటమిని 2029 ఎన్నికల్లో ఢీ కొట్టాలీ అంటే వైసీపీ పూర్తి స్థాయిలో తన బలాలను ప్రదర్శించాల్సి ఉంది అని అంటున్నారు. ఇక వైసీపీ అధినాయకత్వం 2014, 2019, 2024 ఫలితాలను మాత్రమే చూస్తోంది. కానీ ప్రతీ ఎన్నికకూ ఒక ప్రత్యేకత ఉంటుంది. అంతే కాదు కొత్త ఓటర్లు వస్తారు. రాజకీయ సామాజిక ఆర్థిక పరిస్థితులు మారుతాయి. దాంతో ఏ ఎన్నికకు ఆ ఎన్నిక అన్నట్లుగానే పోరాడాల్సి ఉంటుంది. ఏపీలో చూస్తే టీడీపీ కూటమి వైసీపీ అంటున్న సంక్షేమాన్ని అందిపుచ్చుకుంది. తన బ్రాండ్ అయిన అభివృద్ధిని కూడా తోడుగా చేసుకుంది. అలాగే ప్రతీ అంశం మీద కూటమికి ఒక స్పష్టమైన విజన్ ఉంది. అదే వైసీపీ అయితే ఇప్పటిదాకా నమ్ముకుంటున్నది కూటమి పట్ల వచ్చే వ్యతిరేకతను మాత్రమే అని అంటున్నారు. కచ్చితంగా వచ్చేసారి తమకే జనాలు ఓటు చేస్తారు అని అతి ధీమాతో ఉన్నారని అంటున్నారు. ఈసారి ఎన్నికలు వైసీపీకి చావో రేవో అన్నట్లుగానే ఉంటాయి. ఎందుకంటే ఒక ప్రాంతీయ పార్టీగా వైసీపీ ఈసారి ఎన్నికల్లో గెలుపు పిలుపే వినాలి. ఓటమి సంభవిస్తే మాత్రం అది ఆ పార్టీకే అతి పెద్ద ముప్పుగా మారుతుంది. వైసీపీ వరసగా రెండు సార్లు ఓడితే మాత్రం అది పార్టీ ఉనికికే ముప్పుగా మారుతుంది. అందువల్ల వైసీపీకి నో ఆప్షన్. గెలుపు అన్నది ఆ పార్టీ అజెండాగా మారాలి. అది జరగాలి అంటే దేన్ని లైట్ తీసుకోకూడదని అంటున్నారు. రాజధాని విషయంలో కాని అభివృద్ధి అజెండా విషయంలో కానీ వైసీపీ తనదైన విజన్ ని విస్పష్టంగా ఆవిష్కరించాలి. కథ అయితే సాగదు : కూటమి చేయలేనిది ఏదో తాను చేస్తాను అని జనాలను ఒప్పించాలి మెప్పించాలి. ఏపీ ప్రజలు కచ్చితంగా అభివృద్ధిని కోరుకుంటున్నారు. కేవలం సంక్షేమ పథకాలతోనే కథ అయితే సాగదు అన్నది వైసీపీ గుర్తించి ఏపీ నవ శకం మీద తనదైన బ్లూ ప్రింట్ ని రెడీ చేసుకోవాలి. అవసరమైతే మేధావులతో చర్చించాలి. దానిని జనం ముందు చర్చకు పెట్టాలి. అలాగే దూరమైన వర్గాలను దగ్గరకు చేర్చుకోవడానికి తగిన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని అంటున్నారు. అన్నింటికీ ఒకటే మాత్ర అదే పాదయాత్ర అన్నట్లుగా వైసీపీ ఆలోచిస్తే మాత్రం ఇబ్బంది అవుతుందని అన్న విశ్లేషణలు ఉన్నాయని అంటున్నారు.

# విజయవాడ గ్రేటర్ అయ్యేలోపు నగరాన్ని ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి చేస్తాము

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ● 9వ డివిజన్ లో పర్యటించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ● నేషనల్ హైవే, కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలన ● బెంజ్ సర్కిల్ పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పూర్తిస్థాయిలో చర్యలు ● పటమట లంక నుంచి ఎమ్.జి రోడ్డుకి ఫ్లై ఓవర్ కింద రోడ్డు ఏర్పాటు ● మార్చి 15వ తేదీన ఎ.కొండూరు మండలంలో వాటర్ ట్యాంకులు ప్రారంభోత్సవం ● కమ్యూనిస్టు నాయకులు నిర్మాణాత్మక విమర్శలు చేయాలని ఎంపీ సూచన







**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 : (వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ గ్రేటర్ కాక ముందే తాగునీటి , స్ట్రాంమ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలతో పాటు నగరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, సుజనా చౌదరిలతో కలిసి కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ లోని ప్రధాన రద్దీ ప్రాంతమైన బెంజ్ సర్కిల్, లారీ ఓనర్స్ హాల్, జ్యోతి కన్వెన్షన్ హాల్ పరిసరాల్లో వాహనాలు, స్థానికులు రాకపోకలు సాగించడానికి అనువుగా ఉండేలా చర్యలు తీసుకునేందుకు శుక్రవారం నేషనల్ హైవే పిడి తో కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీకేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగులు పడుతున్నాయని వెల్లడించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, చెన్నుపాటి గాంధీ తదితరులు జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్, కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్లతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం పార్కింగ్ స్థలం సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పటమటలంక వాసులు స్క్యూ-బ్రిడ్జ్ కింద నుంచి ఇటువైపునకు రావడానికి వీలుగా రోడ్డు మార్గం కావాలని నేషనల్ హైవే అధికారులను కోరగా అందుకు సమ్మతించినట్లు తెలిపారు. హైవే వెంట గ్రీనరీ అభివృద్ధికి ముందుకొచ్చినందుకు లారీ ఓనర్స్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, మున్సిపల్ మరియు నేషనల్ హైవే శాఖలతో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. రెండు నెలల్లో ప్రస్తుత సమస్యల పరిష్కారానికి చర్యలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొత్త బస్ స్టాండ్ నుంచి స్క్యూ బ్రిడ్జి వరకు, అలాగే కనకదుర్గమ్మ వారధి వద్ద జనాలు దిగేందుకు, ఎక్కేందుకు వీలుగా ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన సమర్పించామని వెల్లడించారు. దీనికి సంబంధించి 'ఇన్ ప్రిన్సిపల్'గా మినిట్స్ నమోదు చేసి అధికారులకు పంపినట్లు తెలిపారు. అంతకుముందు గద్దె రామారావుతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం లభిస్తే ఫ్లైఓవర్ నిర్మాణం వేగవంతమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో కృష్ణలంక ప్రాంతానికి చెందిన లక్షన్నర మందికి పైగా ప్రజలకు ఎంతో ప్రయోజనంగా వుంటుందని పేర్కొన్నారు. వెస్టన్ బైపాస్ పూర్తి కావడం, బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు వరకు, అలాగే బెంజ్ సర్కిల్ నుంచి కొత్త బస్ స్టాండ్ వరకు ప్రతిపాదిత ఫ్లైఓవర్లు పూర్తి అయితే నగర ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు

**కమ్యూనిస్టులు నిర్మాణత్మక విమర్శులు చేయాలి** ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తాను కృష్ణలంకలో అండర్‌పాస్‌ల నిర్మాణంపై పదేపదే విజ్ఞప్తి చేయడంతో జాతీయ రహదారి అధికారులు రాణిగారి తోట వద్ద సబ్‌వేను మంజూరు చేశారని తెలిపారు. ప్రమాదాలకు కేంద్రంగా మారిన ఆ ప్రాంతంలో భద్రతా సమస్యలు సబ్‌వే నిర్మాణంతో తొలగిపోతాయని చెప్పారు. శుక్రవారం టెండర్లు తెరవనున్నట్లు వెల్లడించారు. ఈ దశలో ఇప్పుడే నిద్ర లేచినట్లు సిపిఐ, సిపిఎం ఎందుకు ధర్నాలు చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. గత ఐదేళ్లలో నగర అభివృద్ధిపై స్పందించని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రస్తుతం విమర్శలు చేయడం విచారకరమని అన్నారు. నిర్మాణాత్మక విమర్శలు స్వాగతిస్తామని, అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించారు.

**మరో 10 రోజుల్లో నగరానికి పట్టిన చీడ పోతుంది** నగరాభివృద్ధికి రూ.3 వేల కోట్ల తో డి.పి.ఆర్. తయారు చేయటానికి ఒప్పుకోని మున్సిపల్ కౌన్సిల్ నగరానికి పట్టిన చీడ అంటూ మండిపడ్డారు. మరో పది రోజుల్లో ఆ చీడ పోతుందని..ఆర్.యు.బి, ఆర్.వో.బి, సబ్ వే లు, డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ లకు సంబంధించిన డిపిఆర్ లు రెడీ అవుతున్నాయన్నారు.

**మార్చి 15వ తేదీ ప్రారంభోత్సవం** అలాగే జి.కొండూరు పరిసర ప్రాంతాల్లో 18 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన వాటర్ ట్యాంకులు మార్చి 15 ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కిడ్నీ బాధితుల కోసం ట్యాంకర్లతో మంచి నీరు అందిస్తున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన కాంట్రాక్టులను పునఃప్రారంభించి పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా నది నుంచి నీటిని సరఫరా చేసే ప్రాజెక్ట్‌కు చివరి దశ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మార్చి 15కల్లా అన్ని గ్రామాల్లో, అన్ని హ్యాబిటేషన్స్ లోనూ ఎక్కడైతే షెడ్యూల్ ట్రైబ్స్ ఉన్నారో ఇబ్రహీంపట్నం నుంచి కృష్ణనది నీళ్లు అందించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ బెంజ్ సర్కిల్ నగరానికి ప్రధాన కూడలి కాగా, దాదాపు 68 ఏళ్లుగా ప్రతిష్టాత్మక ప్రాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. 2014-19 కాలంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషితో డబుల్ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిందని, దాని వల్ల కొంతమేర ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమైనప్పటికీ రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా మరిన్ని చర్యలు అవసరమని వివరించారు. ప్రస్తుతం ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కనకదుర్గమ్మ ఆలయం సమీపం నుంచి బెంజ్ సర్కిల్ వరకు, అలాగే బెంజ్ సర్కిల్ నుంచి పెనమలూరు, గోశాల వైపు వెళ్లేలా కొత్త ఫ్లైఓవర్ ప్రతిపాదనను కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ "ప్రతిపాదన పంపించండి, శాంక్షన్ చేసే బాధ్యత నాది" అని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అధికారిక ఆమోదం వచ్చిన తర్వాత పూర్తి వివరాలు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్, జ్యోతి కన్వెన్షన్ ప్రాంతంలో అధిక రద్దీ ఏర్పడుతున్న నేపథ్యంలో ఫ్లైఓవర్ కింద ప్రత్యేక సర్వీస్ రోడ్లు, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై ఎంపీ కేశినేని శివనాథ్ నేషనల్ హైవే పీడీ, మున్సిపల్ కార్పొరేషన్ సీఈ, ఎంపీ, స్థానిక కార్పొరేటర్ క్రాంతి శ్రీ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాంధీ సమక్షంలో సమగ్ర చర్చలు జరిపినట్లు తెలిపారు. చంద్రమౌళి నగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు అటు నుంచి ఇటు వెళ్లేందుకు అనేక మార్గాలపై సూచనలు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులను కూడా కలుపుకొని సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాంధీ , కార్పొరేటర్లు చెన్నుపాటి క్రాంతి శ్రీ, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయి బాబు, టిడిపి నాయకులు నాగమోతు రాజా, కె.వి.రమేష్, వై.వి.ఈశ్వరరావు, కె.వి.రామారావు, చెన్నుపాటి వజీరు, సత్యనారాయణ, చిలకలపూడి లక్ష్మణరావు,రమణ, లక్ష్మణ్ స్వామి,శరత్, చలపతిరావు, సూరపనేని సురేష్, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలి








**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలని విజయవాడ నగర పాలక సంస్థ బయాలజిస్ట్ వి కామేశ్వరరావు ప్రజలతో అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం రాధా నగర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు విఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయోలజీస్ట్ కామేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ యు పి హెచ్ సీ ఆర్ పద్మావతి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.


# సైబర్ నేరగాళ్ల కుట్రను భగ్నం చేసిన కృష్ణాజిల్లా పోలీసులు.



**మచిలీపట్నం ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం ఈడేపల్లి ప్రాంతానికి చెందిన పెద్దిరెడ్డి హరినాథ్ (రిటైర్డ్ బెల్ కంపెనీ ఉద్యోగి) తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుండి వీడియో కాల్ రావడంతో లిఫ్ట్ చేయగా, ఫోన్‌లో పోలీసు యూనిఫామ్ ధరించిన వ్యక్తి తాను పూణే నుండి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటిసి) అధికారి అని పరిచయం చేసుకొని, మీపై సీబీఐ కోర్టులో అరెస్ట్ వారెంట్ జారీ అయిందని, నలుగురు ఉగ్రవాదులను అరెస్ట్ చేయగా వారి వద్ద నుండి మీ ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నామని, మీరు వారికి సహకరించారని ఆరోపిస్తూ "మిమ్మల్ని డిజిటల్‌గా అరెస్ట్ చేస్తున్నాము" అంటూ భయభ్రాంతులకు గురి చేశాడు. నకిలీ అధికారులు వృద్ధ దంపతులను ఉదయం నుండి సాయంత్రం వరకు వీడియో కాల్‌లోనే ఉంచి, వారి ప్రతి కదలికపై నిఘా ఉంచుతూ మానసిక ఒత్తిడికి గురిచేశారు. ఈ సందర్భంగా ఇంట్లో అద్దెకు ఉంటున్న మణి అనే వ్యక్తి వారి అనుమానాస్పద పరిస్థితిని గమనించి ఆరా తీయగా, "నేను డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నాను" అని హరినాథ్ చెప్పడంతో ఇది సైబర్ మోసం కావచ్చని అనుమానించి వెంటనే చిలకలపూడి పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న వెంటనే చిలకలపూడి సీఐ షేక్ అబ్దుల్ నబీ వారి ఇంటికి చేరుకొని వృద్ధ దంపతులకు భరోసా ఇచ్చి ధైర్యం కల్పించారు. అనంతరం సదరు నకిలీ పోలీసులను వీడియో కాల్‌లోకి తీసుకుని వెనుక నుండి ప్రశ్నించగా, కంగుతిన్న సైబర్ మోసగాడు వెంటనే కాల్ కట్ చేసి పరారయ్యాడు. ఈ సందర్భంగా సీఐ షేక్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు ఆదేశాల మేరకు ప్రజల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, "డిజిటల్ అరెస్ట్" అనే పదం చట్టంలో ఎక్కడా లేదని, ఇది పూర్తిగా సైబర్ నేరగాళ్ల పన్నాగమని తెలిపారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఈ తరహా మోసాలు చేసి కోట్లు కొల్లగొడుతున్నారని, ఎవరైనా పోలీసుల పేరుతో వీడియో కాల్ చేసి బెదిరించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# వర్చువల్ ల్యాబ్ వెబ్సైట్ ఉపయుక్తం

**- జే ఎన్ టి యూ ఆచార్యులు శంకర్**




**మచిలీపట్నం ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఐఐటి ఆచార్యులు పొందుపరచిన సాంకేతిక సమాచారం తో నడుస్తున్న వర్చువల్ ల్యాబ్ వెబ్సైట్ ను ఇంజనీరింగ్ విద్యార్థులు అనుసరించాలి అనీ అనంతపురం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం ప్రొఫెసర్ ఆచార్య వి. శంకర్ సూచించారు. శుక్రవారం నాడు కృష్ణా విశ్వవిద్యాలయానికి విజిటింగ్ ప్రొఫెసర్ గా విచ్చేసి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి సాంకేతికంగా కొన్ని సూచనలు మెళకువలు చెప్పే క్రమంలో ముఖ్యంగా వర్చువల్ ల్యాబ్స్ అనే వెబ్ సైట్ గురించి దానిలో భారతదేశంలోని వివిధ ఐఐటీలలో పనిచేసే ప్రొఫెసర్లు పొందుపరిచిన సాంకేతిక విద్యా వివరాలతో పాటు విద్యార్థులకు ఉపయోగపడే అంశాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె రాంజీ మాట్లాడుతూ ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడే చాలా అంశాలను ఆచార్య వి శంకర్ చర్చించారని వాటిని మీ భవిష్యత్తును మలుచుకునే క్రమంలో సక్రమంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు వివరించారు. ఇంజనీరింగ్ కళాశాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మకందారులు-కొనుగోలుదారుల సమ్మేళన కార్యక్రమం వ్యాపార అభివృద్ధికి ఊతం - జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో త్వరలో నిర్వహించనున్న అమ్మకందారులు-- కొనుగోలుదారుల సమ్మేళన కార్యక్రమం వ్యాపార అభివృద్ధికి ఊతం అందిస్తుందని, కార్యక్రమంలో పాల్గొని వ్యాపార మెళకువలు పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్వయం సహాయక సంఘాల వ్యాపారస్థులకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల వ్యాపారస్థులకు నిర్వహించిన వ్యాపార మెళకువలు అవగాహన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక దేశ అభివృద్ధిలో విద్య, పరిశ్రమల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ ఆ దిశగా స్వయం సహాయక సంఘాల వ్యాపారాలను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకు వెళ్లేందుకు ఒక వేదిక ఏర్పాటు చేశామని తెలిపారు. దీనికోసం వచ్చే నెల మార్చి 10వ తేదీన పెనమలూరు మండలం కానూరులోని విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో అమ్మకందారులు-- కొనుగోలుదారుల సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వ్యాపారస్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొని మార్కెటింగ్ సౌకర్యం, రుణ సౌకర్యం, ఉత్పత్తుల కొనుగోలులో వినియోగదారుల ప్రాధాన్యతలు, వివిధ రకాల ఉత్పత్తుల తయారీ తదితర అంశాలలో వ్యాపార మెళకువలు పొంది తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వ్యాపారంలో ఎలాంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తినా గట్టి సంకల్పంతో ముందుకెళ్తే విజయం సాధించవచ్చని, అలాంటి అవరోధాలను ఎలా అధిగమించాలో, లైసెన్స్ పొందడం, తమ వ్యాపారానికి సంబంధించిన ఉత్పత్తులను నాణ్యతగా, ఆకర్షణీయంగా మలిచి వినియోగదారులను ఆకట్టుకునే వ్యాపార వ్యూహాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో సలహాలు, సూచనలు అందించడానికి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం ప్రయోగాత్మకంగా చేపట్టామని, వ్యాపారస్తులందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, డి ఆర్ డి ఎ పి డి హరిహర నాథ్, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డిఐసి జిఎం ఆర్ వెంకట్రావు, జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, పశుసంవర్ధక, ఉద్యాన, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు చిన్న నరసింహులు, జె జ్యోతి, షేక్ షాహిద్ బాబు, మార్క్ఫెడ్ డిఎం మురళీ కిషోర్, మార్కెటింగ్ ఎడి నిత్యానంద్, ఎల్ డి ఎం రవీంద్రారెడ్డి, బ్యాంక్ అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వాసిరెడ్డి ని పరామర్శించిన మాజీ ఎంపి లగడపాటి




**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 27( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలో గత కొద్ది రోజుల క్రితం శ్రీ తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ మరియు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, వాసిరెడ్డి బెనర్జీ సతీమణి శంకర్ భవానీ మృతి చెందిన విషయం తెలుసుకున్న విజయవాడ మాజీ ఎంపీ. లగడపాటి రాజగోపాల్ శుక్రవారం వాసిరెడ్డి బెనర్జీ స్వగృహమునకు వచ్చి వారిని పరామర్శించారు. శంకర భవాని చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నూతనముగా నిర్మించబడుతున్న శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి వారి దేవాలయం మరియు అయ్యప్ప స్వామి దేవాలయాన్ని దగ్గర ఉండి చూపించిన అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ కి దేవాలయాలను చూపించి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈరోజున చాలా సంవత్సరాల తర్వాత పాత స్నేహితులు అందరూ వాసిరెడ్డి బెనర్జీ కుటుంబాన్ని పరామర్శించడం బాధగానే ఉన్న... పాత బంధుమిత్రులందరూ కలవటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో మహా చండీ యాగం



**కోదూరు,ఫిబ్రవరి 27(వార్తా ప్రభ) :**కోదూరు గ్రామంలో కొలువై భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న శ్రీ గంగానమ్మ ఆలయ పునర్ ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా శుక్రవారం మహా చండీ యాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక హోమ గుండాలు ఏర్పాటు చేసి 18 మంది దంపతులతో వేద పండితులు మంత్రోచరణతో శాస్రోక్తంగా నిర్వహించారు. ఆలయం వద్ద 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ చైర్మన్ కోట యుగంధరరావు పర్యవేక్షించారు.

# ఆత్మవిశ్వాసం ఉండాలి!



ఆత్మవిశ్వాసముంటే
అసాధ్యమే ఉండబోదు
పంచభూతాలు సైతము
అగును పాదాక్రాంతము

సవాళ్ళను ఎదుర్కొనే
జవాబులు రాబట్టుకునే
సామర్థ్యమే పెరగాలి
సాహసమే చేయాలి
తరిమి తరిమి కొట్టాలి
హానిచేయు పిరికితనము
దినదినమూ ఎదగాలి
దక్కుతుంది గౌరవము
చేస్తేనే ప్రయత్నము
అనుకున్నది సాధ్యమగును
తీసుకునే నిర్ణయము
చేస్తుంది ప్రభావితము

**-గద్వాల సోమన్న,**

గణితోపాధ్యాయుడు, ఎమ్మిగనూరు,సెల్:9966414580

# కంటి చూపు లోపాలను నిర్లక్ష్యం చేయెుద్దు

**పోలీస్ కమిషనర్ డా ఏం.రమేష్**
**220 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు**





**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 27 (వార్తాప్రభ):** రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా సైబరాబాద్ పోలీస్ మరియు సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి వట్టినాగులపల్లిలోని ఎంఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్--2026' ఫేజ్--2 కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రెస్టైన్ ఎయె హాస్పిటల్స్ తమ ప్రిస్టిన్ విజన్ ఫౌండేషన్ ద్వారా లారీలు,టిప్పర్లు,బస్సులు తదితర భారీ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించింది.220 మంది డ్రైవర్లకు పరీక్షలు చేశారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా.ఎం.రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రతి సంవత్సరం అధిక సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతోందన్నారు.కంటి చూపు లోపాలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు .బాధ్యతాయుతంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ పాటించాలని పేర్కొన్నారు.ట్రాఫిక్ డీసీపీ-1 రంజన్ రతన్ కుమార్ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు.ట్రాఫిక్ డీసీపీ--2 శేషాద్రిని రెడ్డి మద్యం సేవించి వాహనం నడపకూడదన్నారు.ప్రిస్టిన్ ఐ హాస్పిటల్స్ డాక్టర్ శ్రావ్య 40 ఏళ్లు దాటిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు,ఎస్సీఎస్సీ ప్రతినిధులు,వైద్య సిబ్బంది, భారీ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

## మందుముల పరమేశ్వర్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన విఠల్ నాయక్



**కాప్రా,ఫిబ్రవరి 27:(వార్తా ప్రభ)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, కాప్రా డివిజన్ నాయకులతో కలిసి శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ మా నాయకులు మందుముల పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ గా మరియు వారి సతీమణి శ్రీమతి మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ కార్పొరేటర్ గా బాధ్యతలు నిర్వహిస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై ఉప్పల్ అభివృద్ధికి బాటలు వేస్తూ, ఆదర్శ దంపతులుగా ఉప్పల్ ప్రజలచే ప్రశంసలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. శ్రీమతి మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి దశాబ్దన్నర కాలంగా ప్రజాసేవలో వివిధ బాధ్యతలు నెరవేరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మెప్పు పొంది, వారి బాటలో ప్రజా పాలనను కొనసాగిస్తున్నారని, వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ ఉన్నత పదవులు అలంకరిస్తూ రాష్ట్రస్థాయి తిరుగులేని నాయకులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హృదయపూర్వకంగా భగవంతుని ప్రార్థిస్తూ,వారిని ఘనంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ సీనియర్ నాయకులు తన్నీరు శ్రీహరి, మరియు అల్లం రాకేష్ యాదవ్, నరేందర్ గౌడ్, అల్లం సాయి యాదవ్, అల్లం సతీష్ యాదవ్, కమలాకర్, సంతోష్ చారి, మరియు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై కూచిపూడి నృత్య విద్యార్థుల కళా నీరాజనం



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27:(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న 'ధర్మపథం' సాంస్కృతి క కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ కూచిపూడి కళాకారిణి కోట సరిత నేతృత్వంలో వారి శిష్య బృందం అమ్మవారి సన్నిధిలో అద్భుతమైన ప్రదర్శనను ఇచ్చారు.

**కార్యక్రమ విశేషాలు:**సాయంత్రం 6 నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూచిపూడి సంప్రదాయానికి అద్దం పట్టేలా మొత్తం 10 అంశాలను ప్రదర్శించారు.ప్రారంభంలో 'అంభా పరాకు' మరియు 'వినాయక కౌత్వం'తో విద్యార్థులు సభను ఆధ్యాత్మికంగా ప్రారంభించారు.భక్తి భావం: 'నమః శివాయతే', 'నర్తన గణపతిం', 'శివ స్తుతి' అంశాల్లో విద్యార్థులు చూపిన ముద్రలు, అభినయం ప్రేక్షకులను అలరించాయి. **సంకీర్తనలు:** రామదాసు కీర్తన, 'లలిత హరళి' మరియు 'ప్రభు శివాష్టకం' వంటి ప్రసిద్ధ కీర్తనలకు విద్యార్థులు లయబద్ధంగా నర్తించారు.ప్రత్యేక ఆకర్షణగా కూచిపూడి నృత్యంలో అత్యంత కష్టతరమైన 'తరంగం' ప్రదర్శనను విద్యార్థులు ఎంతో చాకచక్యంగా ప్రదర్శించి భక్తుల మెప్పు పొందారు. చివరగా 'జయ జయ దుర్గే' నృత్యంతో కార్యక్రమం మంగళప్రదంగా ముగిసింది.నృత్య విద్యార్థులు కనబరిచిన ప్రతిభను, వారి క్రమశిక్షణను భక్తులు మనసారా అభినందించారు. భారతీయ సనాతన ధర్మాన్ని, శాస్త్రీయ కళలను భావితరాలకు అందించే లక్ష్యంతో సాగుతున్న ఈ తరహా కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోంది.

# యువత గళం.. దేశ ప్రగతికి ఇంధనం!!

- ప్రజాస్వామ్య పాఠాలపై పట్టు సాధించండి
- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. జి. నరేందర్
- గోదావరిఖనిలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్
- గెలుపొందిన ఐదుగురుకి రాష్ట్ర స్థాయి పోటీలకు అవకాశం
- నోడల్ ఆఫీసర్ ఏ.సాంబశివ రావు



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 27 (వార్తాప్రభ ప్రతినిధి)**మార్చి 5వ తేదీన గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న పెద్దపల్లి జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026 గోడ పత్రికను ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. జీ. నరేందర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వాలు నిర్వహించే ఇలాంటి సదస్సుల్లో పాల్గొని తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. నోడల్ ఆఫీసర్ ఏ. సాంబశివ రావు మాట్లాడుతూ......యాభై సంవత్సరాల అత్యవసర పరిస్థితి భారత ప్రజాస్వామ్యం నేర్చుకుంటున్న పాఠాలు అనే అంశంపై 18 నుండి 25 ఏళ్ల లోపు యువత తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మూడు నిమిషాల పాటు ప్రసంగించవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు 'మై భారత్' పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, పాల్గొన్న వారికి ప్రయాణ ఖర్చులు అలాగే సర్టిఫికెట్లు అందజేస్తామని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి సభ్యులు, అధ్యాపకులు పాల్గొనగా, ప్రచార కమిటీ సభ్యులు లెఫ్టినెంట్ బి. తిరుపతి, డా. ఎం. నరేష్ బృందాలు వివిధ కళాశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్-2026 ఆవిష్కరణ.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్--2026ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మరియు సంఘం అసోసియేట్ అధ్యక్షులు గొట్టిముక్కుల మహేందర్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమం తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆపరేషనల్ సర్కిల్ కార్యాలయం, లక్ష్మీదేవిపల్లి వద్ద నిర్వహించబడింది.ఈ సందర్భంగా గొట్టిముక్కుల మహేందర్ మాట్లాడుతూ, ఉద్యోగులు సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. పరస్పర సహకారంతో పనిచేసి నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా కృషి చేయాలని సూచించారు. సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలిచే కార్యక్రమాలు చేపట్టి అందరి ప్రశంసలు పొందాలని అన్నారు జిల్లా అధ్యక్షులు అనంతుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సంఘం తరపున తోటి ఉద్యోగులు, పేద విద్యార్థులు మరియు ఆర్థికంగా వెనుకబడిన పద్మశాలి కుటుంబాలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా సంఘం ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేయడం, అవార్డులు పొందిన ఉత్తమ ఉద్యోగులను సత్కరించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర కార్యాలయం మరియు అన్ని జిల్లా కార్యాలయాల్లో వివాహ సేవా కేంద్రాలు నిర్వహిస్తున్నామని వివరించారు. సభ్యుల సహకారంతోనే ఈ సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు . హైదరాబాద్‌లో సంఘానికి స్వంత కార్యాలయ భవనం ఉండి, సేవా కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దూలం నట్రాజ్, ఆర్గనైజేషనల్ కార్యదర్శి పసునూతి వెంకటేశ్వర్లు, కోశాధికారి పుట్ట లింగమూర్తి, ఉపాధ్యక్షులు వేముల మురళి, కొండి పద్మజ, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం నియామకం



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణ జిల్లావిజయవాడ యనమలకుదురు శ్రీ భద్రావతి సమేత శ్రీ భావన ఋషి దేవస్థాన ప్రాంగణంలోకృష్ణ జిల్లా పద్మశాలి సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయవాడకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బిల్లర్ తుమ్మలచెర్ల పానకాలరావు (గోపి )ని నియమించడం జరిగింది . మరియు కృష్ణాజిల్లా యనమలకుదురు నివాసి కృష్ణ జిల్లా అధ్యక్షుడిగా బట్టు శ్రీనివాసరావుని నియమించారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలియ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు వీరిని నియమించడం జరిగింది. 2026 ఏప్రిల్ 26న మంగళగిరిలో జరిగే రాష్ట్ర పద్మశాలి మహాసభ జయప్రదం చేయాలని రాష్ట్రంలో ఉన్న పద్మశాలీలు అందరూ కూడా భారీగా తరలి వచ్చేలా చేయాలని కోరడం జరిగింది .ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ ముంగపాటి వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుద్దంటి రవికిరణ్ ,యనమలకుదురు పద్మశాలియ సంఘ సభ్యులు మరియు కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఉన్నత అధికారులపై కూటమి ప్రభుత్వం

# కక్షసాధింపులు మానుకోండి

**గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి హెచ్చరిక**



**గన్నవరం, ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ లపై చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోంది. ఇది ఇంకా కొనసాగితే ఆ సామాజిక వర్గ ప్రజలు కూటమి ప్రభుత్వం నకు తగిన గుణపాఠం చెపుతారని గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి ఈ రోజు ఒక ప్రకటనలో హెచ్చరించారు .ఆంధ్రప్రదేశ్‌లో ఐఏఎస్, ఐపీఎస్ లపై ఈ ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోందని వైసిపి నేత గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి విమర్శించారు. దళిత ఐఏఎస్,ఐపిఎస్ లపై చంద్రబాబు దాష్టీకం కొనసాగుతోందని సిన్సియర్ ఆఫీసర్లను సస్పెండ్ చేసి వేధిస్తున్నారన్నారు. ఐపీఎస్ ఆఫీసర్లను ఏ కారణం చేత సస్పెండ్ చేశారు? పి.వి. సునీల్ కుమార్ గానీ, సంజయ్ కుమార్ గానీ, జాషువాగానీ, విశాల్ గున్ని లాంటి అధికారులను కూడా మీరు సస్పెండ్ చేశారన్నారు. కారణం ఏమిటి? ఆరోపణలు ఏమిటి? నేటికి కూటమి ప్రభుత్వం చెప్పటం లేదు. 1969 సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం వీళ్ళను సస్పెండ్ చేసే అధికారం మీకు ఉండొచ్చు. కానీ సస్పెండ్ చేసిన తర్వాత వాళ్లకు ఇచ్చే ఛార్జ్ షీట్ ఏంటి? ఆ విచారణ ఎప్పుడు పూర్తి చేస్తారు? వాళ్ళ రిటైర్మెంట్ వరకు ఇలాగే కక్షసాధింపు చర్యలు కొనసాగిస్తారా అని అడుగుతున్నా అన్నారు.పోలీసు శాఖలో 130 మందికిపైగా ఏ పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్నాది అబద్ధమా చెప్పాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత అనేక ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి కానీ కూటమి ప్రభుత్వం లాగా అధికారులను ఎవరు వేధించలేదనీ,.ప్రస్తుతం ఈ ప్రభుత్వం చర్యలు చూస్తుంటే కేవలం కక్ష పూరిత రాజకీయాలే కనిపిస్తున్నాయన్నారు. దళితుల పక్షాన, పేదల పక్షాన నిలబడే అధికారులను టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసం అని అడుగుతున్నా అన్నారు.అధికారం ఉందిగదా అని ఒక గిరిజన లంబాడి కులమునకు చెందిన జిల్లా పోలీసు సూపర్డెంట్ ని కూడా బెదిరించటం పత్రికలు వీడియోలు ద్వారా చూస్తున్నాం అన్నారు.ఇది సరి కాదనీ, ఇప్పటికైనా జరిగిన తప్పులు సరిదిద్దుకుని కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఈ ప్రభుత్వంనికి విజ్ఞప్తి చేస్తున్నాను అని ఆమే అన్నారు.లేని పక్షంలో దీనికి ప్రతిఫలం 2029 లో జరిగే ఎన్నికలలో ఆ సామాజిక వర్గాల ప్రజలు మీకు తగిన గుణపాఠం చెపుతారు అని ఆమే హెచ్చరించారు.

# సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం

**నగరంలో 4000 కేజీల ప్లాస్టిక్ సీజ్ చేసిన ప్రజారోగ్య సిబ్బంది**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ బ్యాన్ లో భాగంగా, నగర పరిధిలో గల అన్ని డివిజన్లో విస్తృతంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై డ్రైవ్ నిర్వహించి 4000 కేజీ ప్లాస్టిక్ ని సీజ్ చేశారని, విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న అన్ని షాపుల్లో శానిటరీ సూపర్వైజర్, ఇన్స్పెక్టర్ మరియు సెక్రెటరీలతో శుక్రవారం ఉదయం పలు షాపులను తనిఖీ చేసి రైడ్ నిర్వహించి 4000 వేల కేజీల సింగిల్ న్యూస్ ప్లాస్టిక్కు సీజ్ చేసి, 3 లక్షల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. అందులో అత్యధికంగా 37వ డివిజన్లో వారికి 120 మైక్రాల కన్నా మందము తక్కువ గల క్యారీ బ్యాగులు వాడుతున్నందుకు సుమారు 250 కేజీ కవర్లు సీజ్ చేసి రూ 1,80,000/- రూపాయలు జరిమాన విధించారని తెలిపారు. పర్యావరణహితమైన వస్తువులే వాడాలని, ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రజలకు, వినియోగ దారులకు, అమ్మేవారికి, ప్రజారోగ్యం సిబ్బంది అవగాహన కల్పించారు. 120 మైక్రోన్ల కంటే తక్కువగా ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవకుండా పర్యావరణానికి హాని కల్పించేవని వారికి చెప్పి, కేవలం పర్యావరణహితమైన గుడ్డ సంచులు, జ్యూట్ బాగులు, పేపర్ కవర్లు, వాడాలని వాళ్లకి అవగాహన కల్పించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కలెక్టర్.



**మచిలీపట్నం ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయం ఏవోగా పనిచేస్తున్న రాధిక కుమారుడు వివాహం జరిగింది. శుక్రవారం మచిలీపట్నం జిల్లా కోర్ట్ సెంటర్ రెవెన్యూ కళ్యాణ మండపం లో రిసెప్షన్ వేడుకలను నిర్వహించారు. ఈ రిసెప్షన్ లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ డిఆర్ఓ చంద్రశేఖర రావులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సుజాతనగర్ మెయిన్‌రోడ్లపై డ్రైనేజీ/మురుగునీరు

**అధికారులపై మండిపడుతున్న ప్రజలు**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,రోడ్లపై డ్రైనేజీ/మురుగునీరు ప్రవహించడం వల్ల ప్రయాణికులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ట్రాఫిక్ జామ్‌లు మరియు రోడ్ల విధ్వంసం (గుంతలు) సంభవిస్తున్నాయి. మురుగునీటి నిల్వ వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ సమస్యకు ప్రధాన కారణాలు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, నిర్వహణ లోపం మరియు పూడిక తీయకపోవడం.

**ముఖ్యమైన సమస్యలు మరియు పరిణామాలు::** రోడ్డుపై మురుగు నీరు నిలవడం వల్ల జీవనం సాగిస్తున్న ప్రజలకు ఆటంకం కలిగి, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి.రోడ్ల పాడవ్వడం: నిరంతరం నీరు నిలవడం వల్ల రోడ్డు ఉపరితలం మెత్తబడి గుంతలు పడతాయి ప్రజా ఆరోగ్య సమస్యలు: నిల్వ ఉన్న మురుగునీటి వల్ల దోమలు పెరిగి, దుర్వాసన వెదజల్లుతూ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది.ప్రమాదాలు: మరి సుజాతనగర్ సెంటర్లో అయితే హైవే రోడ్డు మీదనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు అందువలన ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతారు, మరియు కొన్నిసార్లు ప్రమాదాలకు దారితీస్తుంది.

**పరిష్కార మార్గాలు:**నిర్వహణ అధికారులు క్రమ తప్పకుండా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయాలి మౌలిక సదుపాయాలు: సరిగ్గా పనిచేసే డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలి.మరమ్మతులు: రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి, నీరు బయటకు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలి అంటున్న ప్రజలు

## మున్సిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పదవ తరగతి విద్యా బోధన.

**మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్**
**విద్యార్థులకు డివిఆర్ ప్రేరణ తరగతులు**



**మచిలీపట్నం ఫిబ్రవరి 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మునిసిపల్ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా పదవ తరగతి విద్యార్థులకు విద్యాబోధన జరుగుతోందని మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కాలేఖాన్ పేట మున్సిపల్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సలహాదారుడు దిట్టకవి వెంకటేశ్వరరావు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు అంటే భయం లేకుండా ఉండాలన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. పరీక్షల్లో ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలకు జవాబులు రాయాలన్నారు. పరీక్షల సమయంలో వేళకు నిద్ర పోవాలన్నారు. సాత్విక ఆహారాన్ని భుజించాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ హసీం బేగ్ మాట్లాడుతూ, కాలేఖాన్ పేటలో 560 మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థిని ఒకరికి ఇంటర్ లో ఫీజు తానే చెల్లిస్తానని వాగ్దానం చేశారు. జిల్లా కో కన్వీనర్ ముదిగొండ శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 175 మానవతా శాఖల్లో 60 వేలమంది పదవ తరగతి విద్యార్థులకు విజయీభవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయుడు నారాయణ రావు, మాజీ కౌన్సిలర్ బొడ్డు శ్రీను, యోగ మాస్టర్ బత్తిన నాగ సుభాషిణి పాల్గొన్నారు ఈ సందర్భంగా దిట్టకవి వెంకటేశ్వరరావు నాగ సుభాషిణిని ఘనంగా సత్కరించారు.

## గురుకుల మోడల్ పరీక్ష



**రెడ్డిగూడెం, ఫిబ్రవరి 27(వార్తాప్రభ ప్రతినిధి) :** మార్చి నెల ఒకటో తేదీన గురుకుల పాఠశాలల్లో 5 వ తరగతి ప్రవేశానికి జరిగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఫ్రెండ్స్ సర్వీస్ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్ నందు మోడల్ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ హన్న, గౌరవ సలహాదారుడు ప్రత్తిపాటి పాల్ఇమ్మానుయేలు, మరొక డైరెక్టర్ సిహెచ్ సువిజ్ఞాన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188